## కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి: ఎమ్మెల్యే గాంధీ


ఎమ్మెల్యే గాంధీతో హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్ హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కాలనీలో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా కార్యవర్గసభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా కాలనీ అభివృద్ధి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడు బాబురావు, జనరల్ సెక్రటరీ యాదిరెడ్డి, జాయింట్ సెక్రటరీ సీహెచ్ వెంకట్రామరెడ్డి, ట్రెజరర్ మదన్‌మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వెంకట్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ (స్పోర్ట్స్, కల్చరల్) రామనాథం, జోనల్ ఎగ్జిక్యూటివ్‌లు సి.శంకర్‌రావు, డీఏ.ప్రకాశ్, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.


దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## విద్యుత్‌నగర్ సమస్యలను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే గూడెం

భెల్‌కాలనీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం, విద్యుతనగర్ నడుమ నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. భెల్ ఎంఐజీ విద్యుత్‌నగర్ ముఖద్వారం వద్ద గల పంచముఖ ఆంజనేయ, గాయిత్రి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం మూసివేయడంపై కాలనీ సొసైటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమస్యను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందిస్తూ ఆదివారం కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే భెల్ ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చించారు. దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి బీహెచ్‌ఈఎల్ స్థలం అయినప్పటికీ ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా యాజమాన్యం చర్యలు చేపట్టాలనారు. ఈ విషయంపై భెల్ ఎగ్జిక్యూటివ్‌ని కలిసి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. నాయకులు సోమిరెడ్డి, బాబ్జీ, ప్రభాకర్, రవీందర్, సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా సరితారావు


సరితారావు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన సరితారావును రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేసే ప్రతీ ఒక్కరినీ బీజేపీ గుర్తు పెట్టుకుంటుందని సరితారావు అన్నారు. పదవి తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.


ఎన్నికైన కమిటీ సభ్యులు

## రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

జీడిమెట్ల, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జగద్గిరిగుట్ట షిర్డీహిల్స్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా బ్యంగి గోవర్ధన్, గౌరవ అధ్యక్షుడిగా ఏ.శ్రీనివాసరావు, బి.వీరన్న, జనరల్ సెక్రటరీగా తోట వెంకటేశ్వరరావు (టీవీరావు), కోశాధికారిగా పి.శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా యు.లక్ష్మణ్, బి.శ్రీధర్‌రావు, జాయింట్ సెక్రటరీగా ఎం.రమేష్; కార్యవర్గ సభ్యులుగా జె.శ్రీనివాసరావు, బి.విజయసింహ, మాలకొండయ్య, వాజీద్ అలీఖాన్, గంగారామ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సభ్యత్వం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, పాత్రికేయులు

## టీయూడబ్ల్యూజేలో చేరిన సీనియర్ పాత్రికేయులు

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే 143కి చెందిన ఎలక్ట్రానిక్స్ మీడియా జర్నలిస్టులు ఆ సంఘానికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర యూనియన్ వర్కింగ్ జర్నలిస్టులు (టీయూడబ్ల్యూజే- ఐజేయూ)లో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.బాల్‌రాజ్ తెలిపారు. ఆదివారం సూరారంలోని కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.సాయిబాబాతో కలిసి జర్నలిస్టులకు సభ్యత్వాలను అందజేశారు. అనంతరం బాల్‌రాజ్ మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకూ జర్నలిస్టుల పక్షపాతిగా టీయూడబ్ల్యూజే-ఐజేయు పాటుపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్, శర్మ, రమణ, ప్రవీణ్, భాస్కర్‌రెడ్డి, సంతోష్, ప్రెస్‌క్లబ్ కోశాధికారి శేషారెడ్డి, సీనియర్ పాత్రికేయులు సూర్యనారాయణ రెడ్డి, నాగేంద్రచారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.


గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

## అలీతలాబ్ చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

హైదర్‌నగర్, సెప్టెంబర్29 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ అలీతలాబ్ చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చేపడుతున్న గుర్రపుడెక్క తొలగింపు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అలీతలాబ్ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు తుదిదశలో ఉన్నాయని, చెరువుచుట్టు పక్కల ప్రజల విజ్ఞప్తి మేరకు గుర్రపుడెక్క తొలగిస్తున్నట్లు తెలిపారు. చెరువులను ఆహ్లాదకరంగా మార్చి ప్రజలు సేదతీరేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ మహదేవ్, స్థానికులు పాల్గొన్నారు.

## భెల్ కార్మికులకు అత్యవసర సహాయ నిధిని పెంచాలి

భెల్‌కాలనీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అనారోగ్యం, ప్రమాదవశాత్తు మృతి చెందుతున్న ఉద్యోగుల కుటుంబాలకు బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం అందిస్తున్న డెత్ రిలీఫ్ ఫండ్‌ను పెంచాలని భెల్ జేఏసీ సభ్యులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు రాజ్‌కుమార్ (బీఎంఎస్), నరేందర్ ( హెచ్‌ఎంఎస్) , భాషా (సీఐటీయూ), అమర్‌నాథ్ (అభ్యుదయ వర్కర్స్ యూనియన్) హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. విధినిర్వహణలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి యాజమాన్యం తక్షణ సహాయం డెత్ రిలీఫ్ ఫండ్ (డీఆర్ఎఫ్) కింద లక్ష రూపాయలను అందిస్తోందని, దానిని 10 లక్షలకు పెంచాలని కోరారు. కార్మికుల వినతిపై జీఎం హెచ్‌ఆర్ సానుకూలంగా స్పందించారని జేఏసీ నేతలు తెలిపారు.

## నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

గాజులరామారం, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): బీజేపీని ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని బస్తీలు, కాలనీల్లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

# మద్దెలకుంట చెరువు మాయం

### 11 ఎకరాలకు 3.28 ఎకరాలు చూపుతున్న ధరణి పోర్టల్

దుండిగల్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్, గాజులరామారం గ్రామ పరిధిలో 11 ఎకరాల మద్దెలకుంట చెరువు కబ్జాదారుల కబంద హస్తాల్లో చిక్కి కనుమరుగైపోయింది. చెరువులను కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పటికే పలు చెరువుల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ వస్తున్నారు. అయినా గాజులరామారంలోని చెరువులకు రక్షణ లేకుండా పోయింది.


ఒకపక్క కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణం


చెరువులో రాళ్లు వేసి పూడ్చివేస్తోన్న ఆక్రమణదారులు

ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం, స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రూ.100 కోట్లు విలువ చేసే 11.73 ఎకరాల చెరువు కనుమరుగైపోయింది. ఈ మధ్యకాలంలో చెరువు మొత్తం రాళ్ల, మట్టితో నింపుతూ చుట్టూ ప్రహరీ నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చెరువును పూర్తిగా కబ్జా చేస్తూ ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. ఒక పక్క చెరువులు పరిరక్షణకు హైడ్రా కూల్చివేతలు, కేసులు నమోదు చేస్తున్నా కబ్జాదారులు మాత్రం బయపడడం లేదు. సర్వే నెంబరు 335లో మద్దెల కుంటచెరువు (ఐడీ.2800/ఇఎన్/15) ఇరిగేషన్ నోటిఫికేషన్ ప్రకారం 11.73 ఎకరాల చెరువు చూపిస్తోంది. కానీ ధరణి రికార్డులో మాత్రం 3 ఎకరాల 28 గుంటలు మాత్రమే చూపిస్తుంది. ఇది ఎలా సాధ్యమైందో అర్థం కాని పరిస్థితి. మిగతా ప్రభుత్వ చెరువు స్థలం ఏమైంది? ఎవరికి రిజిస్ట్రేషన్ చేశారు?

### మద్దెలకుంట చెరువును కాపాడాలి

గాజులరామారం గ్రామ శివారులో కబ్జాకు గురైన మద్దెల కుంట చెరువును రెవెన్యూ అండ్ నార్త్ ట్యాంక్ ఇరిగేషన్ అధికారులు చెరువులో కొనసాగుతున్న పనులను తక్షణమే నిలిపివేసి, కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి. అలాగే మద్దెలకుంట చెరువును కాపాడాలని, 11 ఎకరాలకు పైగా ఉన్న చెరువును ధరణిలో 3 ఎకరాల 28 కుంటలు మాత్రమే ఎలా చూపిస్తుంది. దీని వెనకాల ఎవరైనా సరే వెలుగులోకి తీసుకురావలిసిన అవసరం ఉంది.

- ఆకుల సతీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీజేపీ నాయకులు

### కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| టమాట | రూ.49 | ఉల్లిగడ్డ | రూ.54 |
| వంకాయ | రూ.30 | మామిడికాయ | రూ.15-20 |
| బెండకాయ | రూ.40 | అరటికాయ | రూ.8-11 |
| పచ్చిమిర్చి | రూ.28 | చామగడ్డ | రూ.40 |
| బజ్జి మిర్చి | రూ.70 | ముల్లంగి | రూ.4-5 |
| కాకరకాయ | రూ.35 | చిలగడదుంప | రూ.35 |
| బీరకాయ | రూ.28 | గుమ్మడికాయ | రూ.25 |
| క్యాబేజీ | రూ.19 | నిమ్మకాయలు | రూ.50-60 |
| బీన్స్ | రూ.55 | మునగకాయలు | రూ.8-10 |
| క్యారెట్ | రూ.35 | బొప్పాయి | రూ.40 |
| గోబిపువ్వు | రూ.23 | పుట్టగొడుగులు | రూ.40 |
| దొండకాయ | రూ.35 | ఎండుమిర్చి | రూ.220 |
| చిక్కుడుకాయ | రూ.50 | అల్లం | రూ.200 |
| గోరుచిక్కుడు | రూ.40 | వెల్లుల్లి | రూ.380 |
| బీట్‌రూట్ | రూ.28 | చింతపండు | రూ.140 |
| క్యాప్సికం | రూ.55 | పండుమిర్చి | రూ.80 |
| ఆలుగడ్డ | రూ.36 | ఉసిరి | రూ.65 |
| కీర | రూ.18 | కరివేపాకు | రూ.60 |
| దోసకాయ | రూ.28 | పర్వల్ | రూ.35 |
| సొరకాయ | రూ.13 | పల్లికాయ | రూ.60 |
| పొట్లకాయ | రూ.18 | లోబా | రూ.25 |
| కంద | రూ.55 | ఆ కాకరకాయ | రూ.120 |
| ఉల్లిపొరక | రూ.45 | | |

ఈ ధరలు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## నేటి నుంచి కూకట్‌పల్లిలో బతుకమ్మ సంబరాలు

హైదర్‌నగర్, సెప్టెంబర్29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 2 నుంచి బతుకమ్మ సంబరాలు ప్రారంభం కానున్నాయి. కానీ కూకట్‌పల్లిలో మాత్రం ముందుగానే సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలు కూకట్‌పల్లిలో వైభవంగా జరుపుతాయన్నారు. ఈవేడులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం మొదటి బతుకమ్మ, మంగళవారం పెద్దల అమావాస్య, 8వ తేదిన అట్ల బతుకమ్మ, 9వ తేదీ బతుకమ్మ అలిగిపోవడం, 10వ తేదీ సద్దుల బతుకమ్మ, 12వ తేదీ విజయదశమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### బతుకమ్మ సంపుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి

హైదర్‌నగర్: బతుకమ్మ పండుగ సందర్భంగా వివేకానందనగర్ డివిజన్‌లోని బతుకమ్మ కుంటలను కార్పొరేటర్ రోజాదేవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కుంటలు శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేయాలని, కుంటలకు వచ్చేమహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, భద్రయ్య, తులసిదాస్, స్థానిక నాయకులు ఆంజనేయులు, జగదీష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కొండలరావు, శ్రీనివాస్‌సాగర్, రవీందర్ రావు, సోమయ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావ, చిన్న, రమేష్‌రావ్, శ్యామ్ పాల్గొన్నారు.

## బీహెచ్‌ఈఎల్ ఆలయాల్లో ఏపీ హోంమంత్రి అనిత పూజలు


హోంమంత్రి అనితకి వేద ఆశీర్వచనం చేస్తున్న పండితులు

భెల్‌కాలనీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల మురళీకృష్ణ స్వామి దేవాలయంలో ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల ముందు ఇక్కడి దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం తీసుకుని ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో మరో మారు బీహెచ్‌ఈఎల్‌లో గల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, మురళీకృష్ణ స్వామి దేవాలయాల్లో విశేషపూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాల ప్రధాన అర్చకులు భార్గవ్, జితేంద్ర మంత్రి అనిత, కుటుంబసభ్యులకు చేసి పట్టువస్త్రాలు అందజేశారు.

## ప్రత్యేక నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: కూన


సమస్యలు విన్నవించుకోనేందుకు వచ్చిన జనంతో శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో పలు కాలనీల ప్రజలు, సంక్షేమ సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యేను కలిసి పలు వినతి పత్రాలు అందజేశారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలు రోడ్లు, డ్రైనేజీలు, సానిటేషన్, వీధిలైట్లు, పార్కుస్థలాల అభివృద్ధి గురించి ఆయనకు విన్నవించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ఆయన కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.

### అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటోందని కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్‌పురి కాలనీవాసులు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను కూన శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించడంతో 72 లక్షల రూపాయల నిధులను రోడ్డు ఏర్పాటుకు మంజూరు చేశారు. ప్రజలకు ఏసమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి కృష్ణగౌడ్, సయ్యద్‌రషీద్, దామోదర్‌రావు, వెంకటేశ్వరరావు, సత్యగుప్తా, ఇస్మాయిల్, భాగ్యలక్ష్మి, గౌస్ పాల్గొన్నారు.

### భవన నిర్మాణ గుంతలో పని చేస్తుండగా

## మట్టిపడి కార్మికుడి మృతి


రవికుమార్(ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రంగదాముని చెరువు (ఐడీఎల్ ట్యాంక్) వద్ద నిర్మాణంలో ఉన్న హానర్ కన్‌స్ట్రక్షన్స్‌లో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రవికుమార్(20) గత నాలుగు నెలలుగా హానర్ సంస్థలో తండ్రి కిషోర్‌రామ్‌తో కలిసి పనులు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో కేబుల్ వైరింగ్ కోసం తీసిన గుంతలో దిగి వైర్ డ్యామేజ్ చెక్‌చేస్తున్న సమయంలో గుంత నుంచి తీసిన మట్టి అకస్మాత్తుగా గుంతలో పడటంతో రవికుమార్ ఇరుక్కుపోయాడు. అతని తండ్రితో పాటు తోటి కార్మికులు రవికుమార్‌ను బయటకు తీసి వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే యువకుడు మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇంద్రసేన తెలిపారు.

## వృద్ధురాలి హత్య కేసులో పనిమనిషికి యావజ్జీవ కారాగారశిక్ష


వసుంధరలక్ష్మి

చందానగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు పనిమనిషికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జడ్జీ తీర్పునిచ్చారు. నల్లగండ్లలో ఓ ఇంట్లో పని పనిషిగా చేరిన గడ్డం వసుంధరలక్ష్మి(20) 2016 సెప్టెంబర్ 9న ఆ ఇంట్లో ఉన్న వృద్ధురాలు పడాల ఉమాదేవిని దారుణంగా హత్య చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా నల్లజెర్ల మండలం పూలపాటు గ్రామానికి చెందిన వసుంధరలక్ష్మి నగరానికి వచ్చి ఉమాదేవి ఇంట్లో పనిమనిషిగా చేరింది. ఈ క్రమంలో వసుంధరలక్ష్మికి పెళ్లి కుదిరింది. అయితే పెళ్లి తర్వాత సంతోషంగా జీవించాలనే ఆశతో పని చేస్తున్న ఇంట్లో బంగారం, డబ్బులు కాజేసి పారిపోవాలని పథకం వేసింది. ఆ ఇంట్లో ఉమాదేవితో పాటు ఆమె కొడుకు, కోడలు ఉంటున్నారు. ఐతే ఉమాదేవి కొడుకు, కోడలు ఉద్యోగానికి వెళ్లగా ఇంట్లోని బంగారు వస్తువులు, డబ్బు దొంగిలించే క్రమంలో అలికిడి వినబడటంతో ఏమిటని ఉమాదేవి ప్రశ్నించింది. దీంతో విషయం బయటపడుతుందనే భయంతో వృద్ధురాలిని వసుంధరలక్ష్మి కత్తితో గొంతుకోసి నగలు, నగదుతో పరారైంది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు వృద్ధురాలి కొడుకుకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ కేసులో న్యాయస్థానం పనిమనిషి వసుంధరలక్ష్మికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పారుపల్లి కశ్యప్

## ముగిసిన హ్యామ్స్‌టెక్ స్పోర్ట్స్ మానియా-2024

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ప్యాషన్, ఇంటీరియర్ డిజైనింగ్ పరంగా మాత్రమే కాదు, క్రీడలలోనూ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్న విద్యార్థుల కోసం హ్యామ్స్‌టెక్ ఇనిస్టిట్యూట్ తమ స్పోర్ట్స్ మానియా -2024ను నిర్వహించింది. నగరంలోని తమ ఆరు సెంటర్ల విద్యార్థుల కోసం కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. బాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ తదితర క్రీడల్లో 500 మందికి పైగా విద్యార్థులు పోటీపడ్డారని హ్యామ్స్‌టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ సీఈఓ అజితారెడ్డి తెలిపారు. కేపీహెచ్‌బీలో ఓ స్పోర్ట్స్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో బాడ్మింటన్ క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్ పాల్గొనడంతో పాటుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఓనం వేడుకల్లో మంత్రి సీతక్క


ఓనం వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

గచ్చిబౌలి, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం ప్రతీ ఒక్కరిని అక్కున చేర్చుకుంటుందని, అందుకే వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి రావడానికి ఇష్టపడటమే కాకుండా వారి సొంత ప్రాంతంగా భావిస్తారని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి నల్లగండ్ల మళయాళీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓనం వేడుకలు సుమారు 800 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు అన్విత గ్రూప్ సీఎండీ అచ్యుతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం ఇస్తోందని, ఈ కారణంతోనే ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నగరానికి భారీ సంస్థలు పెట్టుబడి పెట్టడానికి, తమ వ్యాపారాలను విస్తరించడానికి ముందుకొస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు మళయాళీలు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.


తులసినగర్‌లో పగలు వెలుగుతున్న స్ట్రీట్ లైట్

## పగలే వీధిదీపాల వెలుగులు

అల్లాపూర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికాకరుల నిర్లక్ష్యం కారణంగా వీధులు రాత్రిళ్ల అంధకారాన్ని అలముకోగా పగలు స్ట్రీట్‌లైట్స్ వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. అమావాస్య సమీపిస్తుండటం రాత్రిళ్ల వీధిదీపాలు వెలగకపోవడంతో గాయత్రినగర్ 60 ఫీట్ల రోడ్డులో నడవటం కూడా కష్టంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. చీకటి కారణంగా ఆకతాయిల బెడద ఆందోళనకు గురిచేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్ల ఇలా ఉండగా అల్లాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పగలు విద్యుత్‌దీపాలు వెలుగుతున్నాయని తెలిపారు. కరెంటు ఆదా చేయాలన్ని విజ్ఞాపనలు ఇవ్వటం కాదు, ముందు విద్యుత్ సిబ్బంది వృథాను అరికట్టాలని కోరారు.

## వ్యవసాయ ఆర్థిక విశ్లేషణపై సెమినార్



సెమినార్‌లో శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నాయకులు

మియాపూర్, సెప్టెంబర్ 29 (ఆంధ్ర జ్యోతి): కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషనలోని రాజశేఖర్‌రెడ్డి అధ్యయన కేంద్రంలో ఆదివారం 'భారతదేశంలో సమకాలీన వ్యవసాయ పరిస్థితి- సమస్యలు పరిష్కారాలు' వ్యవసాయ ఆర్థిక విశ్లేషణ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. అధ్యయన కేంద్ర డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో వ్యవసాయ ఆర్థికవేతలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాస్త్ర నిపుణులు ప్రొఫెసర్ నరసింహారెడ్డి ప్రసంగిస్తూ దేశంలో ఆహార సమస్య, రైతుల దుస్థితికి గల కారణాలను వివరించారు. దేశంలో ఈ నాటికి కూడా అధికశాతం సాగు ధనిక, మధ్యతరగతి రైతుల మధ్య ఉందని 85శాతం చిన్న రైతులు, వ్యవసాయ కూలీలకు తక్కువ భూమి ఉందన్నారు. రైతుల ఆత్మహత్యలకు కారణాలు వారు పండించిన పంటలకు ఆదాయం దక్కకపోవడమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, విశ్రాంత వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ అరిబండి ప్రసాదరావు, సహకార వ్యవసాయ సంఘాల ఉద్యమ నేత నైనాని గోవర్దన్, రామకృష్ణారెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్ముతున్న ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ముగ్గురిని, వినియోగిస్తున్న ఐదుగురిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. సింగాడికుంటలో జోరుగా గంజాయి వాడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో దాడిచేయగా ఓ నిర్మాణుష్య ప్రదేశంలో కొందరు యువకులను గుర్తించి, వారిని తనిఖీ చేయగా బిహార్‌కు చెందిన నితీష్‌కుమార్, కనయ్యకుమార్, అనిల్‌కు గంజాయి అమ్ముతున్నట్టు తేలింది. జువెలరీ పనిచేసే వీరు అధిక ఆదాయం కోసం బిహార్ నుంచి రాజుషా అనే వ్యక్తి వద్ద గంజాయి కొని వాటిని చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్మకాలు చేస్తున్నట్టు నిర్ధారణ అయింది. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్‌లు 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి గంజాయి కొని వినియోగిస్తున్న పంకజ్‌కుమార్, రాకేష్‌కుమార్, లలిత్ పాశ్వాన్, దీపక్ కుమార్, కరణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.

## వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వైద్య శిబిరాలు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ పరిధిలో పారిశుధ్య కార్మికులు, ఎంటమాలజీ సిబ్బంది కోసం ఈనెల 30వ తేదీ నుంచి వైద్యశిబిరాలు, పోషకాహారంపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తుందని జోన్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలో సుమారు 3,200 మంది పని చేస్తున్నారని, వారి ఆరోగ్యం, పరిశుభ్రత గురించి జడ్సీ అపూర్వ్ చౌహాన్ ప్రత్యేక దృష్టిసారించినట్లు పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లి సర్కిల్ హెచ్‌ఎంటీ శాతవాహనగర్ సొసైటీ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు జడ్సీ ప్రారంభిస్తారన్నారు.

● నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా యశోద ఆస్పత్రి సౌజన్యంతో అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు.

● హైదర్‌నగర్: ఆధునిక జీవితంలో జీవనశైలి లో మార్పులు హార్ట్ ఎటాక్స్‌ని నివారించడంలో ప్రధానపాత్ర నిర్వహిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని నిజాంపేటలోని హోలిస్టిక్ హాస్పిటల్‌లో ఆదివారం వరల్డ్‌హార్ట్ డే కార్యక్రమం నిర్వహించారు.

● మియాపూర్: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో శ్రీకృష్ణయూత్ ఆధ్వర్యంలో అపోలో హాస్పటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

## నిజాంపేటలో 5కే రన్

### కాలనీలవాసులకు సీపీఆర్‌లో శిక్షణ


5కే రన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): గుండెను జాగ్రత్తగా కాపాడుకోవాలని, ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలు నడవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతోనే ఇది సాధ్యమని ఎస్ఎల్‌జీ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దండు శివరామరాజు అన్నారు. 'ప్రపంచ హార్ట్ డే' సందర్భంగా ఆదివారం ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కే రన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. చుట్టుపక్కల కాలనీలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు మాట్లాడుతూ, నిజాంపేట, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల వారి సౌకర్యార్థం ప్రపంచ హార్ట్ డే సందర్భంగా కొన్ని ప్యాకేజీలను ప్రకటించారు. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 15 వరకు ఇవి అమలులో ఉంటాయని తెలిపారు. సాధారణంగా రూ.2,999 విలువ చేసే ఈసీజీ, 2డి ఎకో, కార్డియాలజిస్టు కన్సల్టేషన్ పరీక్షలతో కూడిన ప్యాకేజీని రూ.799లకే అందిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు. నిజాంపేట, కూకట్‌పల్లి, కౌసల్యకాలనీ, బండారి లేఅవుట్, బాచుపల్లి ప్రాంతాల్లోని అపార్టుమెంట్లు, రెసిడెన్షియల్ సొసైటీలకు చెందిన వారు పాల్గొన్నారు. అనంతరం బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్)లలో శిక్షణ ఇచ్చారు.